నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, మంగళవారం 20 ఆగస్టు 2024 | KAMAREDDY



సోమవారం అర్గుల్ శివారులోని ఫంక్షన్ హాల్‌లో సమావేశమైన మూడు నియోజకవర్గాల రైతులు

# పోరుబాట

- మాఫీ కోసం ఐక్య పోరాటానికి సిద్ధమైన రైతాంగం
- ఎర్రజొన్న తరహాలో మరో ఉద్యమానికి శ్రీకారం
- ఏకమైన మూడు నియోజకవర్గాల రైతులు
- షరతుల్లేని రుణమాఫీ లక్ష్యంగా కార్యాచరణ
- ఈ నెల 24న జాతీయ రహదారి దిగ్బంధనానికి పిలుపు

జక్రాన్‌పల్లి, ఆగస్టు 19: ఇందూరు రైతాంగం మరో పోరాటానికి సిద్ధమైంది. రుణమాఫీ పేరుతో మోసగించిన సర్కారుపై సమర భేరీకి సన్నద్ధమైంది. ఆంక్షలు లేని రుణమాఫీ కోసం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ పురుడు పోసుకున్నది. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ శివారులోని ఫంక్షన్‌హాల్‌లో సోమవారం పార్టీలకతీతంగా జరిగిన సమావేశంలో సరికొత్త వేదిక ఆవిర్భవించింది. మూడు నియోజకవర్గాల రైతులతో కలిసి ఏర్పాటైన ఐక్య కార్యాచరణ కమిటీ రైతుల్ని రుణ విముక్తుల్ని చేసే వరకూ పోరాటం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 24న జాతీయ రహదారి దిగ్బంధనానికి పిలుపునిచ్చింది.


**ఎర్రజొన్న ఉద్యమం తరహాలో..**

రైతులందరికీ రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అమలులో కొర్రీలు విధించింది. దీంతో చాలా మందికి రుణమాఫీ కాలేదు. ఈ నేపథ్యంలోనే ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల రైతులు పోరాటానికి సిద్ధమయ్యారు. భవిష్యత్ కార్యాచరణ కోసం ఆర్మూర్ మార్కెట్ యార్డులో సమావేశం కావాలని నిర్ణయించారు. అయితే, వారిని మార్కెట్ కమిటీ అధికారులు అనుమతించకపోవడంతో అర్గుల్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగానే రైతు ఐక్య కార్యాచరణ కమిటీ పురుడు పోసుకున్నది. పార్టీలకు అతీతంగా జరిగిన ఈ సమేవేశంలో ఎర్రజొన్నల ఉద్యమాన్ని తలపించేలా రుణమాఫీ కోసం మరో ఉద్యమాన్ని లేవదీయాలని తీర్మానించారు.

**ఆంక్షల్లేకుండా అమలు చేయాలని..**

రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను నిండా ముంచిందని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు షరతుల్లేని రుణమాఫీ అమలు కోసం ఉద్యమించనున్నట్లు వెల్లడించారు.

ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 24న జాతీయ రహదారిని దిగ్బంధించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రతి రైతు ఇంటి నుంచి భార్యాభర్తలు అర్గుల్ శివారులోని మైత్రి ఫంక్షన్‌హాల్‌కు తరలి రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్లు ఎలాంటి షరతుల్లేకుండా రూ.2లక్షల లోపు రుణాలను మాఫీ చేసేదాకా పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. అలాగే, రైతుభరోసా డబ్బులను వెంటనే రైతు ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఐక్య కార్యాచరణ కమిటీ ఇన్‌చార్జి ఇట్టెడి లింగారెడ్డి, నేతలు శ్రీనివాస్, ప్రభాకర్, దేవరాం, తిరుపతిరెడ్డి, యాదాగౌడ్, మంథని నవీన్, మోతె రమేశ్, ముప్కాల్ సంతోష్, రైతులు పాల్గొన్నారు.



కామారెడ్డి జిల్లా పిట్లం మండలం పెద్ద రాంపూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

## మాకెందుకు మాఫీ రాలే..

- బ్యాంకులు, సొసైటీల ఎదుట రైతుల ధర్నాలు
- మాఫీ చేయాలని రాస్తారోకోలు, నిరసనలు
- ఉమ్మడి జిల్లాలో మిన్నంటిన ఆందోళనలు

**రుణమాఫీ కోసం** రైతులు రోడ్డెక్కారు. మాకెందుకు మాఫీ కాలేదని ఆందోళనలకు దిగారు. సోమవారం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో అన్నదాతల ధర్నాలు, ఆందోళనలు మిన్నంటాయి. ఆంక్షల్లేకుండా రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేపట్టారు. పాల్దా సొసైటీని రైతులు ముట్టడించగా, నందిపేట్ మండలం వెల్మల్‌లో అన్నదాతలు రాస్తారోకో చేశారు.మూడో జాబితాలోనూ తమ పేరు లేదని ఆవేదనకు లోనైన రైతులు మంగళ్‌పాడ్‌లోని సిండికేట్ బ్యాంక్ ఎదుట ఆందోళనకు దిగారు. దేగాంలోని బ్యాంక్ ఎదుట రైతులు టెంట్ వేసుకుని బైఠాయించారు. పిట్లం మండలం పెద్ద రాంపూర్‌లోనూ రైతులు నిరసన చేపట్టారు.

### రాంపూర్ టీజీబీ ఎదుట ధర్నా

బాన్సువాడ, ఆగస్టు 19: అర్హులైన తమకు రుణమాఫీ కాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కామారెడ్డి జిల్లా పిట్లం మండలం పెద్ద రాంపూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట రైతులు సోమవారం ధర్నాకు దిగారు. రూ. 2 లక్షలలోపు రుణాలు మాఫీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, రూ.50 వేలు, రూ.లక్ష లోపు ఉన్న తమ రుణాలు మాఫీ కాలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులందరికీ రుణాలు మాఫీ చేస్తామన్న కాంగ్రెస్.. ఇప్పుడు కొర్రీలు పెట్టి మోసం చేయడం సరికాదని మండిపడ్డారు. డబ్బుల్లేకే తాము బ్యాంకులో అప్పు తీసుకుంటున్నామన్న రైతులు.. లోన్ ఎంత ఉన్నదనే సంబంధం లేకుండా రూ.2 లక్షలలోపు రుణాలకు సంబంధించిన మాఫీ డబ్బులను ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీపై దేవుళ్ల మీద ఒట్టేసి చెప్పిన రేవంత్‌రెడ్డి ఇలా మోసం చేయడం తగదన్నారు. రైతులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని హెచ్చరించారు.



ఆర్మూర్ మండలం దేగాం గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

### నందిపేట్ - నిజామాబాద్ రోడ్డుపై రాస్తారోకో

నందిపేట్, ఆగస్టు 19: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తమకు రుణమాఫీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం వెల్మల్‌లో రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నందిపేట్–నిజామాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. మూడు విడుతల్లోనూ తమకు రుణమాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కుంటి సాకులు చెబుతూ తప్పించుకోవాలని చూస్తే ఊరుకోబోమని, అర్హులందరికీ రుణమాఫీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఎస్సై హరిబాబు వచ్చి రైతులకు సర్దిచెప్పారు. దీంతో అన్నదాతలు అక్కడి నుంచి వెళ్లి ఏవో ఝాన్సీభవానిని, గ్రామీణ బ్యాంక్ సిబ్బందిని నిలదీశారు. తమకు రుణమాఫీ చేయకపోతే ఉద్యమం లేవదీస్తామని రైతులు హెచ్చరించారు.

**షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలని..**

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 19: షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని దేగాం గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో రుణమాఫీ చేస్తామని ప్రకటించి, ఇప్పుడు ఆంక్షలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

**సిండికేట్ బ్యాంక్ ముట్టడి**

ఎడపల్లి, ఆగస్టు 19: రుణమాఫీ మూడో జాబితాలోనూ తమ పేరు లేదని ఆవేదనకు లోనైన రైతులు మంగళ్‌పాడ్‌లోని సిండికేట్ బ్యాంక్ ఎదుట ఆందోళనకు దిగారు. అర్హులైన తమకు రుణమాఫీ ఎందుకు చేయరని 60 మంది రైతులు ధర్నా చేశారు. సమాచారమందుకున్న ఏవో సిద్ధి రామేశ్వర్, ఎస్సై వంశీకృష్ణారెడ్డి అక్కడకు చేరుకుని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. గ్రామంలో 154 మందికి వర్తించలేదని, బ్యాంక్ మేనేజర్ మాత్రం 67 మందికే కాలేదనడంపై మండిపడ్డారు.

**పాల్దా సొసైటీ కార్యాలయ గేటుకు తాళం**

సారంగాపూర్, ఆగస్టు 19: పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ పాల్దా సొసైటీ కార్యాలయాన్ని రైతులు ముట్టడించారు. గేట్‌కు తాళం వేసి రెండు గంటలకు పైగా నిరసన తెలిపారు. తాము తీసుకున్న రుణం కంటే వ్యవసాయ శాఖ లాగిన్‌లో ఎక్కువగా రుణం పొందినట్లు తప్పుగా నమోదు చేశారని, ఫలితంగా తమకు రుణమాఫీ వర్తించలేదని వాపోయారు. 321 మంది రైతులు రుణం తీసుకోగా, 183 మందికి మాత్రమే మాఫీ వర్తించిందని మిగతా 138 మందికి మాఫీ కాలేదన్నారు. కొందరు రైతులు సొసైటీ సీఈవో రాకేశ్‌ను కలిసి ఆరా తీయగా, తీసుకున్న రుణానికంటే ఎక్కువగా తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ లాగిన్‌లో నమోదు కావడంతో రుణమాఫీ వర్తించలేదని తేలింది. దీంతో రైతులు సొసైటీ గేటుకు తాళం వేశారు. అక్కడకు వచ్చిన సొసైటీ సీఈవో రాకేశ్‌ను నిలదీశారు. సొసైటీ రికార్డులో రైతులు పొందిన రుణాలు సరిగ్గానే ఉన్నాయని, ఏఈవో లాగిన్‌లో (టెస్కాబ్‌లో) ఎక్కువగా రుణం పొందినట్లు తప్పుగా నమోదైందని ఆయన వివరించారు. దీంతో సహకార శాఖ జిల్లా అధికారులను ఇక్కడికి పిలిపించాలని రైతులు పట్టుబట్టారు. అధికారులు స్పందించకపోతే ప్రతిరోజూ సొసైటీకి వచ్చి ఆందోళన కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు.



ముప్కాల్ మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో రక్షాబంధన్‌లో పాల్గొన్న ఉపాధ్యాయినులు, విద్యార్థినులు

## అనుబంధాల రాఖీ

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను ఉమ్మడి జిల్లావాసులు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. సోదరులకు రాఖీలు కట్టి నోరు తీపి చేశారు. రాజకీయ ప్రముఖులు, అధికారులకు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు. కామారెడ్డికి చెందిన టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ హైదరాబాద్‌లో కేటీఆర్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు మహిళలు రాఖీ కట్టి ఆశీర్వచనాలు అందించారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాఖీ కడుతున్న టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్



మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న మోర్తాడ్ మాజీ జడ్పీటీసీ అనిత

## కుండపోత

- ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు
- ఇందూరులో జడివాన
- వరదనీటిలో చిక్కుకున్న బస్సు
- ప్రయాణికులను కాపాడిన స్థానికులు
- లోతట్టు ప్రాంతాలు జలమయం



నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తాలో నిలిచిన వర్షపు నీరు

ఖలీల్‌వాడి/కామారెడ్డి, ఆగస్టు 19: ఉమ్మడి నిజామాబాద్‌లో సోమవారం కురిసిన భారీ వర్షం కురిసింది. గంటన్నర పాటు కురిసిన జడివానకు ఇందూరు వణికి పోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, జన జీవనం స్తంభించింది. రోడ్లు, డ్రెయిన్లు ఏకమై ప్రవహించాయి. మోకాలి లోతు వరకు చేరిన నీటితో ట్రాఫిక్ స్తంభించింది. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా నిలిచిన వరద నీటిలో ఆర్టీసీ బస్సు చిక్కుకు పోయింది. నీటి ఉధృతిని గమనించని డ్రైవర్ ముందుకెళ్లడంతో బస్సు నీళ్లలోనే నిలిచి పోయింది. సగం మేర బస్సు నీటిలో మునిగిపోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఈత వచ్చినవాళ్లు బయటకు దూకి ప్రాణాలు కాపాడుకోగా, మహిళలు, చిన్నపిల్లలు బస్సులోనే చిక్కుకుపోయారు. పోలీసులు, స్థానికులు హుటాహుటిన స్పందించి బస్సులోని మహిళలు, చిన్నారులను సురక్షితంగా బయటకు చేర్చారు. మరోవైపు, ఆర్‌ఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్, గౌతంనగర్, ఖిల్లా రోడ్ తదితర ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు నిలిచింది. దీంతో వాహన రాకపోకలు స్తంభించాయి. మరోవైపు, భీమ్‌గల్‌లో అత్యధికంగా 10 సెం.మీటర్ల వర్షం కురిసింది. నిజామాబాద్ సౌత్ మండలంలో 8.35, నిజామాబాద్ నార్త్‌లో 7.33, కమ్మర్‌పల్లిలో 6 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా తాడ్వాయి లో 3.53 సెం.మీ., మద్నూర్‌లో 3.28, నస్రుల్లాబాద్‌లో 3.18, మాచారెడ్డిలో 2.65, బీర్కూర్‌లో 1.93 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది.




ఖిల్లారోడ్‌లోని క్రీసెంట్ క్రియేటివ్ స్కూల్ ఎదుట నిలిచిన వర్షపు నీరు



జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



వర్షపు నీటిలో చిక్కుకున్న బస్సులో నుంచి ప్రయాణికులను సురక్షితంగా బయటికి తీసుకువస్తున్న స్థానికులు

## దాడుల్లేవ్.. కేసుల్లేవ్

- గ్రామాల్లో జోరుగా పీడీఎస్ దందా
- ఉమ్మడి జిల్లాలో భారీగా అక్రమ వ్యాపారం
- కోళ్ల ఫారాలు, పూరి గుడిసెలు, శివారు ప్రాంతాలే అడ్డాలు
- కన్నెత్తి చూడని యంత్రాంగం

నిజామాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) ఉమ్మడి జిల్లాలో పీడీఎస్ బియ్యం దందా జోరుగా సాగుతున్నది. నిరుపేదల కడుపులు నింపాల్సిన బియ్యం సరిహద్దులు దాటిపోతున్నది. కనిపించని నిఘా, అధికారుల నిర్లక్ష్య వైఖరి మూలంగా అక్రమార్కులకు అడ్డే లేకుండా పోయింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని కీలక ప్రాంతాలే అడ్డాగా ఉచిత బియ్యం దందా అడ్డుఅదుపూ లేకుండా కొనసాగుతున్నది. పేదల కోసం నిర్దేశించిన రేషన్ బియ్యాన్ని ఉభయ జిల్లాల్లోని కీలకమైన రైస్‌మిల్లులకు చేర్చుతున్నారు. అక్కడ పీడీఎస్ బియ్యాన్ని పాలిష్ పట్టి సన్నబియ్యంగా మార్చి మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మరోవైపు, సీఎంఆర్ రూపంలో ప్రభుత్వానికే అంటగడుతున్నారు. పేదల బియ్యాన్ని పందికొక్కుల్లా మేస్తున్న అక్రమార్కులకు కొందరు అధికారులు మద్దతుగా నిలుస్తున్నారు. అక్రమాలను అరికట్టేందుకు నియమించిన డిప్యూటీ తహసీల్దార్లు ఉత్సవ విగ్రహాల్లాగా మారారు. మచ్చుకైనా తనిఖీలే లేకుండా పోయాయి.

**రూ.10కే విక్రయాలు..**

నిజామాబాద్ జిల్లాలో ఆహార భద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ కలిపి మొత్తం 4.03 లక్షల కార్డులు ఉండగా, ప్రతి నెలా 13,432 మెట్రిక్ టన్నులు బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. రేషన్ బియ్యం తినేందుకు అనువుగా లేవని 60 శాతం మంది లబ్ధిదారులు రూపాయి కిలో బియ్యాన్ని రూ.10 చొప్పున అమ్ముకుంటున్నారు. మరోవైపు, చాలా మంది డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కొందరు గల్లీ గల్లీ తిరుగుతూ బియ్యం సేకరిస్తున్నారు. ఇలా పోగేసిన పీడీఎస్ బియ్యాన్ని బడా వ్యాపారులకు రూ.15–20లకు విక్రయిస్తున్నారు. కొంత మంది ఘనులు ఏకంగా కోళ్ల ఫారాల్లో, పూరి గుడిసెల్లో నిల్వలు ఉంచుకుని అవసరం ఉన్నప్పుడు బయటకు పంపుతున్నట్లు సమాచారం. ఈ బియ్యాన్నే రైస్ మిల్ వ్యాపారులు సీఎంఆర్ రూపంలో ప్రభుత్వానికి కట్టబెట్టి దండిగా లాభపడుతున్నారు.



**కామారెడ్డిలో బియ్యం శ్రీను హవా..**

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడ్డ వారిపై కఠిన చర్యలు లేక అక్రమార్కులకు భయం లేకుండా పోయింది. చౌక బియ్యాన్ని నల్ల బజారుకు తరలించే వారిపై పీడీ చట్టం అమలు చేయాలని కేసీఆర్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం అక్రమ దందాను నిరోధించే చర్యలే లేవు. బియ్యాన్ని తరలిస్తూ రెండోసారి పట్టుబడితే జైలుకు పంపాలని నిబంధనలున్నా అలా చేసిన దాఖలాలే లేవు. డబ్బులకు ఆశపడి అధికారులు మమ అనిపిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో బియ్యం శ్రీనుగా పేరొందిన వ్యక్తి బాగోతమే ఇందుకు ఉదాహరణ. గతంలో అసిస్టెంట్ సివిల్ సప్లైస్ అధికారి, కొన్నాళ్లు ఇన్‌చార్జి డీఎస్‌వోగా ఉన్న ఓ వ్యక్తి అండతో బియ్యం శ్రీను రెచ్చిపోయాడు. ఈ విషయం అప్పట్లో ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో సదరు అధికారిని బదిలీ చేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. బియ్యం రవాణాలో ఆరితేరిన ఆ ఘనుడు అధికార పార్టీ నేతల అండతో చెలరేగి పోతున్నట్లు సమాచారం. దాడులు చేసినప్పుడల్లా బియ్యం శ్రీనుతో లింకులు బయటపడుతున్నప్పటికీ ఏనాడు అతడ్ని అరెస్టు చేసిన దాఖలాల్లేవు.

**రేషన్ బియ్యం అమ్ముకోవద్దు..**

పేద వారికోసం ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని అమ్ముకోవద్దు. పీడీఎస్ బియ్యాన్ని కొనడం నేరం. ఎవరైనా అక్రమంగా రాయితీ బియ్యాన్ని కొనుగోలు చేసినా, నిల్వ ఉంచినా అధికారులకు సమాచారం ఇవ్వాలి.

**- కిరణ్ కుమార్, నిజామాబాద్ అదనపు కలెక్టర్**